
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సిద్దిపేట

3

శనివారం 14 జూన్ 2025



పాదయాత్ర చేసిన యువకులను సన్మానిస్తున్న హరీశ్‌రావు

పాలేవో.. నీళ్లేవో.. ప్రజలకు అర్థమైంది

మూడేళ్ల తర్వాత వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే

మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట కల్చరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు పాలు ఏవో, నీళ్లు ఏవో అర్థమైందని.. ఇంకో మూడేళ్ల తర్వాత వచ్చేది మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమేనని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. రైతులను, ఉద్యోగులను, విద్యార్థులను, వృద్ధులను, యువతను అన్ని వర్గాల ప్రజలను రేవంత్‌రెడ్డి మోసం చేశారని ఆరోపించారు. సిద్దిపేటలో శుక్రవారం నిర్వహించిన యువ విద్యార్థి ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల సందర్భంగా పాదయాత్ర చేసిన విద్యార్థులను హరీశ్‌రావు సన్మానించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ సిద్దిపేటలో పుట్టిన గులాబీ జెండా రజతోత్సవం చేసుకుందని, గులాబీ జెండా కోసం మీరు చూపిన పటిమ, పట్టుదలను గుండెల్లో పెట్టుకుంటానని అన్నారు. రజతోత్సవానికి ప్రత్యేకంగా నిలవడానికి సిద్దిపేట నుంచి వరంగల్ వరకు పాదయాత్రగా వచ్చిన అందరికి పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు. ప్రతీ ఒక్కరు జీవితంలో స్థిరపడి తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని సూచించారు. యువత వ్యసనాలకు బానిస అవ్వొద్దని, ఆన్‌లైన్ గేమ్స్‌తో జీవితాలు నాశనం చేసుకోవద్దని, బెట్టింగ్ భూతానికి దూరంగా ఉండాలని చెప్పారు. మద్యం, డ్రగ్స్ వ్యసనాలకు తావు ఇవ్వవద్దని, తన టీమ్‌లో అలాంటి వ్యసనపరులకు చోటు ఉండదన్నారు. ప్రతీ ఒక్కరు ఒక్కో నాయకుడు కావాలని, అందుకు తనవంతుగా ఏం చేయాలో చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరానగర్ బడి' విజయ పరంపర కొనసాగుతూనే ఉండాలి

'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ఎక్స్‌లో పోస్టు చేసి అభినందనలు తెలిపిన హరీశ్‌రావు



Harish Rao Thannee... @BRSHarish Follow

Congratulations and best wishes to the teachers and students of Indiranagar Government School in Siddipet.

I hope this success story continues and inspires many more!

ఇందిరానగర్ బడి.. నూతన ఒరవడి

ఇందిరానగర్ పాఠశాలపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాన్ని ఎక్స్‌లో పోస్టు చేసిన హరీశ్‌రావు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూన్ 13 : సిద్దిపేటలోని ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాల సాధించిన సత్ఫలితాలపై శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాన్ని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే ప్రస్తావిస్తూ ఎక్స్‌లో పోస్టు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల కృషిని అభినందించారు. ఇందిరానగర్ బడి విజయ పరంపర కొనసాగుతూనే ఉండాలని ఆకాంక్షించారు. సర్కారు బడి సాధిస్తున్న అద్భుతాలను ప్రచురించి ఇతర పాఠశాలల విద్యార్థులకు స్ఫూర్తిని కలిగించేలా 'ఆంధ్రజ్యోతి' గొప్ప ప్రయత్నం చేసిందని ప్రశంసించారు.

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన నిర్మలాజగ్గారెడ్డి



టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌కు సంగారెడ్డి జిల్లాలో పార్టీ పరిస్థితులను వివరిస్తున్న నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను టీజీఐఐసీ చైర్ పర్సన్ తూర్పు నిర్మలాజగ్గారెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ముందుగా మహేష్‌కుమార్‌గౌడ్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం సంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ స్థితిగతులపై నిర్మలా జగ్గారెడ్డి వివరించారు. టీపీసీసీ రాష్ట్ర కమిటీలో ఉపాధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శులుగా పలువురు నాయకులకు నియమించి, సంగారెడ్డి జిల్లాకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం పట్ల మహేశ్‌కుమార్‌గౌడ్‌కు నిర్మలా జగ్గారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో పార్టీ బలోపేతానికి ప్రతీఒక్కరూ కృషి చేసేలా కార్యకర్తలకు దిశా, నిర్దేశం చేయాలని సూచించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేలా కార్యకర్తలందరూ సైనికుల్లా పనిచేయాలన్నారు.



చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నిర్మలాజగ్గారెడ్డి

నేడు సిద్దిపేటకు మంత్రి గడ్డం వివేక్ రాక

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, జూన్ 13 : ఇటీవలె మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి శనివారం ఉదయం 8 గంటలకు సిద్దిపేటకు రానున్నారు. శుక్రవారం ఆయనకు పలు మంత్రిత్వ శాఖలు కేటాయించడంతో పాటు ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమించిన సంగతి తెలిసిందే. దీంతో మంత్రి హోదాలో చెన్నూరు నియోజకవర్గంలో పర్యటనకు వెళ్లనున్న ఆయన సిద్దిపేటలోని రంగధాంపల్లి చౌరస్తా వద్ద కాసేపు ఆగనున్నట్లు కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జీ పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ తెలిపారు. మంత్రి గడ్డం వివేక్‌కు స్వాగతం పలికేందుకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా చేరుకోవాలని పిలుపునిచ్చారు. మొదటిసారిగా మంత్రి వివేక్ రానుండటంతో పార్టీ నాయకులు పలు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇప్పటివరకు ఎల్లంపల్లి రిజర్వాయర్ ద్వారా హెచ్‌ఎండబ్ల్యూఎస్(హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లయ్) సేకరిస్తున్న తాగునీటి నుంచి ప్రజ్ఞాపూర్ వద్ద ప్రత్యేకంగా డైవర్షన్ ఏర్పాటు చేసి గజ్వేల్ మండలంలోని కోమటిబండ జీఎల్‌బీఆర్(గ్రౌండ్ లెవల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్)కు నీటిని తరలిస్తున్నారు. ఇందుకు హెచ్‌ఎండబ్ల్యూఎస్‌కు ప్రతీ రోజు రూ.7 లక్షల వరకు చెల్లించాల్సి వస్తున్నది. ఇక ఈ అవసరం లేదు. కొత్తగా నిర్మించిన అక్కారం పంప్‌హౌజ్‌కు, అక్కడి నుంచి జీఎల్‌బీఆర్‌కు మల్లన్నసాగర్ నుంచి నీటిని తరలించేందుకు చేపట్టిన పైపులైన్ నిర్మాణం పూర్తి కావచ్చింది. నెలాఖరులోగా ఈ పైపులైన్ అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇది ప్రారంభమైతే భవిష్యత్తులో తాగునీటి కష్టాలకు చెక్ పడనుంది.



కుకునూరుపల్లి ఆర్వోబీ వద్ద పైపులైన్ పనులు

ఇక శాశ్వత తాగునీరు

మల్లన్నసాగర్ నుంచి కోమటిబండ జీఎల్‌బీఆర్‌కు పైపులైన్ నిర్మాణం

ఇంకా 400 మీటర్ల పనులు మాత్రమే పెండింగ్

నెలాఖరు వరకు అందుబాటులోకి వచ్చే అవకాశం

గజ్వేల్‌తో పాటు ఐదు నియోజకవర్గాలకు సరఫరా



అక్కారం పంప్‌హౌజ్

గజ్వేల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : నాలుగు జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో తాగునీటి కష్టాలు శాశ్వతంగా దూరం కానున్నాయి. మల్లన్నసాగర్ జలాశయం నుంచి ప్రత్యేక ట్యాపింగ్ పాయింట్ ద్వారా తాగునీటిని సేకరించేందుకు నిర్మిస్తున్న పైపులైన్ పనులు చివరి దశకు చేరుకున్నాయి. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఈ పనులు సగమే పూర్తికాగా, ప్రస్తుత ప్రభుత్వం రూ.210 కోట్లను విడుదల చేయడంతో చకచక సాగుతున్నాయి.

పెండింగ్ పనులకు నిధులు

మిషన్ భగీరథ పథకంలో భాగంగా రూ.1212 కోట్ల వ్యయంతో జిల్లాలోని మంగోల్ వద్ద భారీ తాగునీటి శుద్ధి జలాశయాన్ని నిర్మించారు. గత ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేశారు. ఇక్కడి నుంచి 16 కిలోమీటర్ల పైపులైన్, అక్కారం వద్ద పంప్‌హౌజ్ నిర్మించి అక్కడి నుంచి నీటిని తరలించడం ప్రణాళిక. గత ప్రభుత్వం తాగునీటి శుద్ధి జలాశయం, అక్కారం పంప్‌హౌజ్ (దాదాపుగా), 8 కిలోమీటర్ల మేర పైపలైన్‌ను నిర్మాణాన్ని పూర్తి చేసింది. మిగిలిన ఎనిమిది కిలోమీటర్ల పైపులైన్ నిర్మాణంతో పాటు నర్సాపూర్ నియోజకవర్గంలోని రంగంపేట వద్ద జల బండాగారం, ములుగు మండలం అచ్చాయపల్లి నుంచి మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట మండలం ఘన్‌పూర్ వరకు పైపులైన్ నిర్మాణానికి ప్రస్తుత ప్రభుత్వం రూ.210 కోట్లను విడుదల చేసింది. పెండింగ్‌లో ఉన్న ఎనిమిది కిలోమీటర్ల పైపులైన్‌లో 7.4 కిలోమీటర్లు పూర్తవగా, గజ్వేల్ మండలం కొడకండ్ల వద్ద గల కూడవెల్లి వాగుపై 400 మీటర్ల మేర పైపులైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మల్లన్నసాగర్ నుంచి ఆరు నియోజకవర్గాలకు తాగునీటిని అందించేందుకు 10 టీఎంసీలను కేటాయించారు. ఈ పైపులైన్ పనులు పూర్తయితే ప్రజ్ఞాపూర్ వద్ద ప్రత్యేకంగా డైవర్షన్ ఏర్పాటు చేసి హెచ్‌ఎండబ్ల్యూఎస్ ద్వారా సేకరిస్తున్న నీటితో

మిగతా 6వ పేజీలో

నాలుగు జిల్లాలకు ప్రయోజనం

మల్లన్నసాగర్ జలాశయం నుంచి సేకరించిన నీటితో అక్కారం పంప్ హౌజ్ ద్వారా నాలుగు జిల్లాలకు తాగునీటిని తరలించనున్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని కొల్చారం మండలం రంగంపేట జల బాండాగారానికి నీటిని పంపిణీ చేస్తారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట మండలం ఘన్‌పూర్, యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరు, యాదగిరిగుట్ట, భువనగిరికి నీటిని అందించనున్నారు. గజ్వేల్, దుబ్బాకకు కోమటిబండ బీఎల్‌బీఆర్ ద్వారా సరఫరా చేయడంతో పాటు మల్లన్నసాగర్ భూనిర్వాసిత కాలనీకి శాశ్వతంగా తాగునీటిని అందించనున్నారు.



కాడెడ్లకు భలే డిమాండ్

హుస్నాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ శుక్రవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో నిర్వహించే పశువుల సంతకు రాష్ట్రంలోనే కాదు, ఇతర రాష్ట్రాల నుంచి పాడిరైతులు కొనుగోలు, అమ్మకాల కోసం వస్తారు. ఈ శుక్రవారం జరిగిన సంతలో కాడెడ్ల జత రూ.1.90 లక్షల వరకు పలికింది. గత వారమైతే రూ.2 లక్షల వరకు విక్రయించినట్లు రైతులు తెలిపారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన రైగు యాదగిరి కాడెడ్ల జతను రూ.1.90 లక్షలకు, కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామానికి చెందిన రైతు రాజయ్య రూ.1.45 లక్షలకు విక్రయించినట్లు తెలిపారు.





గజ్జెల దండలు.. ముక్కు శికాలు

హుస్నాబాద్ వార సంతలో పశువుల అలంకరణ సామగ్రి దుకాణాల వద్ద రైతులు సందడి కనిపించింది. ఎడ్లు, గేదెలు, ఆవులు, లేగదూడలకు వేసే పనగార్లు, పగ్గాలు, బుట్లు, ముక్కు శికాలు, గజ్జెల దండలు, కురుమ దండలు, సంత్రాలు, ఐదు గజ్జెలు, బారు జోళ్లు వంటివి కొనుగోలుకు ఆసక్తి చూపారు. వీటి ధరలు కూడా విపరీతంగా పెరిగాయని రైతులు పేర్కొన్నారు. - హుస్నాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి)

మున్సిపల్ ఆదాయానికి గండి

సిద్దిపేటలో ఇంటి పన్ను వసూళ్లలో తేడాలు

పలు ఫంక్షన్‌హాళ్లకు పన్ను నిల్

భవనాలు, పలువురు నాయకుల ఇళ్లకు కూడా

క్షేత్రస్థాయిలో చర్యలేవి?



సిద్దిపేట ఆంధ్రజ్యోతి, జూన్ 13 : బల్దియాలకు ప్రధాన ఆదాయ వనరు ఇంటి, నల్లా పన్ను. కానీ, కొందరు రాజకీయ నాయకులు, పలు భవనాల యజమానులు, ఫంక్షన్‌హాళ్ల నిర్వాహకులు ఈ ఆదాయానికి గండి కొడుతున్నారు. కొన్నేళ్లుగా ఎలాంటి ఇంటి పన్ను చెల్లించకుండా ఇష్టారీతినా వ్యవహరిస్తున్నారు.

36 వేలకుపైగా నివాసాలు

సిద్దిపేట మున్సిపల్ పరిధిలో మొత్తం 36,136 ఇళ్లు కాగా, వీటిలో 28 వేలకుపైగా గృహ నిర్మాణాలు, 8వేలకు పైగా కమర్షియల్ భవానాలున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు నూతనంగా భవనాలను నిర్మించుకునేందుకు టీఎస్‌బీపాస్ కింద వందలాది సంఖ్యలో నూతన గృహ, కమర్షియల్ భవన నిర్మాణానికి అనుమతులు జారీ చేశారు. ప్రతీ ఏడాది ఈ పన్ను రూపేణ మున్సిపాలిటీకి రూ.17.53 కోట్ల మేర ఆదాయం వస్తున్నది. ఏడాది నుంచి వెయ్యికిపైగా భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి. ఆ ఇళ్లు తుది దశకు చేరుకోగానే వాటికి ఇంటి నంబర్లు కేటాయిస్తే సిద్దిపేట మున్సిపల్‌కు సుమారుగా మరో రూ. కోటిన్నర ఆదాయం సమకూరనున్నది. దీంతో రూ.20 కోట్ల మేర ఆస్తి, నల్లా పన్ను ద్వారా ఆదాయం రానున్నట్లు మున్సిపల్ అధికారులు అంచనా వేస్తున్నారు.

ఆదర్శంగా నిలవాల్సిన వారే..

సిద్దిపేట మున్సిపల్ పరిధిలో ఆస్తి, నల్లా పన్ను విషయమై చెల్లింపుల్లో ముందుడి అందరికీ ఆదర్శంగా నిలవాల్సిన నాయకులే ఎగవేస్తూ నిబంధనలు బేఖాతర్ చేస్తున్నారు. మరికొందరు తక్కువగా చెల్లిస్తున్నారు. దీంతో సిద్దిపేట మున్సిపల్ ఆదాయానికి గండిపడుతున్నది. ఇటీవల పలు ఫంక్షన్‌హాళ్లకు ఆస్తి పన్ను వేసే ప్రక్రియలో భాగంగా భవనం కొలత తీసుకునేందుకు వెళ్తే మున్సిపల్ సిబ్బందిపై సదరు నిర్వాహకులు రుసరుసలాడినట్లు తెలిసింది. పాటు పలువురు రాకీయ నాయకులు, భవనాల యజమానులు సైతం ఇలాంటి ధోరణినే ప్రదర్శిస్తున్నట్లు సిబ్బంది వాపోతున్నారు. మున్సిపల్ ఆదాయ వనరులను పెంచేందుకు పట్టణంలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లి శివారు ప్రాంతాల్లో గుటుచప్పుడు కాకుండా నిర్మాణాలపై కొరఢా ఝళిపించాలి.



స్ఫూర్తి ప్రదాతలు

రక్తమిచ్చి ప్రాణాలు కాపాడుతున్న దాతలు

ఒక్కొక్కరు పదుల సార్లు రక్తదానం

నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

14, 19, 31, 34, 60, 64, 73... ఏంటీ ఈ నంబర్లు అని అనుకుంటున్నారా.. కొందరు ఎన్నిసార్లు రక్తదానం చేశారో ఆ లెక్క. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ప్రశాంత్‌కుమార్ ఏకంగా 73 సార్లు రక్తదానం చేశారు. ఇలా ఎందరో దాతలు అవసరమున్న వారికి పదులసార్లు రక్తదానం చేయడమే కాదు.. పది మందికి రక్తదానం చేయాలని అవగాహన కల్పిస్తున్నారు.

5లో

పిడుగుపాటుకు 11 మేకలు మృతి

నంగునూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘనాపూర్ గ్రామంలో పిడుగు పాటుకు 11 మేకలు మృత్యువాత పడ్డాయి. శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి మేకలు అదే గ్రామానికి చెందిన బోడ సత్య నారాయణ మామిడి తోటలో చెట్టు కిందకు వెళ్లాయి. ఒక్కసారిగా పిడుగు పడడంతో గ్రామానికి చెందిన ఏలేటి లక్ష్మారెడ్డికి చెందిన 7 మేకలు, లింగంపల్లి కొమురయ్యకు చెందిన 4 మేకలు మృతి చెందాయి. ఆ సమయంలో మేకల కాపర్లు దూరంగా ఉండటంతో ప్రాణాపాయం తప్పింది. సుమారు రూ.2 లక్షల మేర నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. ఆర్ఐ లింగం ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు.

ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌పై దుండగుల దాడి

- ఇటీవల మావోయిస్టులపై తీవ్ర విమర్శలు చేసి.. ర్యాలీ నిర్వహించిన ఆదిత్య
- కమ్యూనిస్టులను దూషిస్తావా అంటూ దాడి చేశారని ఫిర్యాదు
- నిరసనగా హుస్నాబాద్‌లో పాఠశాలల బంద్



గాయాలైన ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సావుల ఆదిత్య

హుస్నాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణానికి చెందిన ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సావుల ఆదిత్యపై గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. పిడిగుద్దులతోపాటు ఆయుధంతో దాడి చేయడంతో ఆదిత్యకు తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో ఆయనను కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స నందిస్తున్నారు. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లో నివాసం ఉంటున్న ఆదిత్య గురువారం ఏబీవీపీ నగర కమిటీని నియమించేందుకు హుస్నాబాద్‌కు వచ్చారు. రాత్రి సమయంలో మండలంలోని పందిల్ల గ్రామంలో స్నేహితుడిని కలిసి తిరిగి హుస్నాబాద్‌కు వస్తున్న క్రమంలో పొట్లపల్లి - ఆరపల్లి రహదారిలో మూత్ర విసర్జన చేస్తుండగా, గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు వెనుకనుంచి వచ్చి కొట్టడమే కాకుండా కాకుండా పదునైన ఆయుధంతో దాడి చేయగా తాను అరవడంతో పారిపోయారు. ఆదిత్యకు గాయాలు కావడంతో మొదట హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. దాడి సమయంలో వారు 'కమ్యూనిస్టులను కుక్కలంటావా' అంటూ కొట్టారని బాధితుడు పేర్కొన్నారు. అయితే, ఆదిత్య ఈ నెల 9న ఏబీవీపీ ఆధ్వర్యంలో మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలని హుస్నాబాద్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మావోయిస్టులపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ కారణంగానే ఆదిత్యపై దాడి చేశారా..? ఇంకా ఏదైనా కారణముందా..? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. హుస్నాబాద్ ఏసీపీ సదానందం, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ తోట మహేశ్‌లు రాత్రి ఆసుపత్రికి వెళ్లి ఆదిత్యతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. శుక్రవారం జరిగిన సంఘటన స్థలం వద్దకు వెళ్లి పరిశీలించారు. ఆదిత్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేశ్ తెలిపారు. ఆదిత్యపై దాడి చేసిన వ్యక్తులను శిక్షించాలని సోమవారం ఏబీవీపీ నాయకులు పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చి పట్టణంలోని మల్లె చెట్టు చౌరస్తాలో ధర్నా చేశారు.

నక్సలైట్ల దిష్టిబొమ్మ దహనం

సంగారెడ్డి అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ సిద్దిపేట జిల్లా కన్వీనర్ ఆదిత్యపై హుస్నాబాద్‌లో జరిపిన దాడి పిరికిపంద చర్య అని ఏబీవీపీ రాష్ట్ర కార్యసమితి సభ్యులు ఆకాశ్ అన్నారు. ఏబీవీపీ నేతపై దాడిని నిరసిస్తూ శుక్రవారం సంగారెడ్డిలోని ఐబీ వద్ద నక్సలైట్ల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆకాశ్ మాట్లాడుతూ ఏబీవీపీ నేతలపై జరిపిన దాడిని దేశభక్తి, విద్యార్థి ఉద్యమంపై దాడిగా అభివర్ణిస్తామన్నారు. ఈ చర్య నక్సలైట్ల ఓటమి భయాన్ని సూచిస్తుందన్నారు. తుపాకులు, కత్తులకు ఏబీవీపీ కార్యకర్తలు భయపడరని, ఆదిత్యపై దాడి చేసిన నక్సల్స్ మూకపై వెంటనే పోలీసు శాఖ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి మహేశ్, ప్రవీణ్, భీమేష్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆదిత్యపై జరిగిన దాడిని సిద్దిపేట పట్టణ బీజేపీ అధ్యక్షుడు బాసంగారి వెంకట్ ఖండించారు. నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



సంగారెడ్డిలోని ఐబీ వద్ద నక్సలైట్ల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

ముంబై సముద్రంలో మునిగి యువకుడి మృతి

- సోదరిని దింపి వచ్చేందుకు వెళ్లి కానరాని లోకాలకు..



రాము (ఫైల్)

రామాయంపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అప్పటిదాకా బోటు షికారు. సోదరి.. ఆమె కుటుంబంతో కలిసి కేరింతలు.. కానీ, ఆ ఆనందం అరక్షణంలో ఆవిరైంది. సోదరిని ఇంటి వద్ద వదిలి వచ్చేందుకు ముంబైకి వెళ్లిన యువకుడు సముద్రతీరంలో అలలకు కొట్టుకపోయాడు. మెదక్ జిల్లా రామాయంపేటకు చెందిన టంకరి రాము (34) సోదరి కుటుంబం ముంబైలో ఉంటుంది. ఆమె తల్లిగారింటికి రాగా, ఆమెను మళ్లీ ముంబైలో వదిలేందుకు టంకరి రాము మూడు రోజుల క్రితం ఆమెతో కలిసి అక్కడి వెళ్లాడు. తెల్లారితే ఇంటికి రావాల్సిన అతను అక్క, ఆమె కుమార్తెలతో కలిసి ముంబై బీచ్‌లో బోట్ షికారు చేశారు. బోటు ఒడ్డుకు వచ్చిన వెంటనే దిగుతున్న క్రమంలో అతను కాలుజారి పడగా, పెద్ద అలలు అతన్ని సముద్ర లోపలి వరకు నెట్టుకుంటూ తీసుకెళ్లింది. అక్కడే ఉన్న పోలీసులు సైతం అతన్ని కాపాడలేని పరిస్థితి ఏర్పడింది. మృతునికి భార్య సరిత 8 ఏళ్లలోపు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటన నేపథ్యంలో ముంబై పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి శుక్రవారం సాయంత్రం పోస్టుమార్టం నిర్వహించారు. శనివారం రామాయంపేటకు మృతదేహం తీసుకురానున్నారు.

చెరువులో మునిగి విద్యార్థి..



సతీష్‌రావు మృతదేహం

అల్లాదుర్గం, జూన్ 13(ఆంధ్రజ్యోతి) : సరదాగా చేపలను పట్టేందుకు చెరువు వద్దకు వెళ్లిన ఈ విద్యార్థి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందిన సంఘటన శుక్రవారం అల్లాదుర్గం మండలం అప్పాజీపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్థులు, స్థానిక ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అప్పాజీపల్లి గ్రామానికి చెందిన ఘనపురం సాయిలు జీవనోపాధి కోసం తన కుటుంబంతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లి జగద్గిర్‌గుట్టలో నివాసముంటున్నాడు. బడులకు వేసవి సెలవులో ఉండడంతో ఈ నెల 5న సాయిలు తన భార్య, ఇద్దరు పిల్లలతో స్వగ్రామమైన అప్పాజీపల్లికి వచ్చాడు. శుక్రవారం తన రెండో కుమారుడు సతీష్‌రావు(14) గ్రామ సమీపంలోని రేళ్లకుంటచెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు. సతీష్‌రావు కుకూట్‌పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శంకర్ తెలిపారు.

స్విమ్మింగ్‌పూల్‌లో పడి వ్యక్తి..

గుమ్మడిదల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు స్విమ్మింగ్ పూల్‌లో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం అన్నారం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ భరత్ భూషణ్ తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ జిల్లా గాగిల్లాపూర్‌కు చెందిన గులాం హుస్సేన్(38) తన ఇద్దరి పిల్లలతో కలిసి శుక్రవారం అన్నారం శివారులోని సిమ్మింగ్ పూల్‌లో ఈతకు వచ్చాడు. ప్రమాదవశాత్తు హుస్సేన్ అందులో పడి ఊపిరాడక మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అల్లుడి మరణ వార్త విని అత్త..



వెంకటరమణ (ఫైల్), ఇందిర (ఫైల్)

హవేళిఘణపూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): భర్త సోదరుడి అల్లుడు గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసి.. ఆమె కూడా గుండె పోటుతో మృతి చెందిన ఘటన మెదక్ జిల్లా హవేళి ఘనపూర్‌లో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. ముత్తాయిపల్లి గ్రామానికి చెందిన అయ్యగారి వెంకటేశ్వర్లు అన్న కుమార్తె సంధ్యారాణి భర్త వివరం వెంకటరమణ(50) భార్య, కుమార్తెతో కలిసి మెదక్‌లో నివాసముంటూ డిగ్రీ కళాశాలలో పని చేసేవాడు. ఇటీవల గజ్వేల్‌కు బదిలీపై వెళ్లాడు. గురువారం రాత్రి బాత్‌రూంకు వెళ్లిన వెంకటరమణకు గుండెపోటు రావడంతో అక్కడే పడిపోయాడు. కుటుంబసభ్యులు గమనించి, బయటకు తీసుకువచ్చేలోపే చనిపోయాడు. విషయాన్ని అయ్యవారి వెంటేశ్వర్లు భార్య ఇందిర(45)కు చెప్పగా, ఆమె స్పృహ తప్పి పడిపోయింది. వెంటనే ఆస్పత్రికి తరలించగా, ఆమెకూ గుండె పోటు వచ్చి మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. వీరి అంత్యక్రియలు ముత్తాపల్లిలో నిర్వహించారు.

చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



బేగరి రాజు మృతదేహం

పెద్దశంకరంపేట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పెద్దశంకరంపేట మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పెద్దశంకరంపేట ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపేట గ్రామానికి చెందిన బేగరి బాలమణితో ఝురాసంగం మండలం కక్కెర వాడ గ్రామానికి చెందిన బేగరి రాజు(32)కు 12 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఇల్లరికం వచ్చి ఇక్కడే ఉంటున్నాడు. గురువారం రాజు భూమి విషయమై తన సొంత గ్రామమైన కక్కెరవాడకు వెళ్లి తిరిగి కొత్తపేటకు వచ్చాడు. అక్కడ ఏం జరిగిందో తెలియదు కానీ అతడు శుక్రవారం ఉదయం కాలకృత్యాల కోసమని పొలం దగ్గరికి వెళ్లి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో రైతు..



ఆంజనేయులు (ఫైల్)

మనోహరాబాద్ జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అనుమనాస్పద స్థితిలో రైతు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధి వెంకటపూర్(అగ్రహారం) గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చిన్నబత్తుల ఆంజనేయులు(35) గురువారం రోజుమాదిరిగానే తన పొలం వద్దకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. అతడి సోదరులు వెంకటేష్, శ్రీకాంత్ ఇంటికి రావడంతో ఆంజనేయులు భార్య నవనీత వాళ్లను అడగగా, పొలం వద్దనే ఉన్నాడని చెప్పారు. ఫోన్ చేసినా స్పందించకపోవడంతో అదే రాత్రి అక్కడికి వెళ్లి వెతికినా కనిపించలేదు. శుక్రవారం ఉదయం వారి పొలం చుట్టుపక్కల వెతకగా పక్కనే ఉన్న అడవిలో వేపచెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గతంలో తమ కుటుంబ సభ్యుల మధ్య భూముల విషయంలో గొడవలు జరిగాయని, తన భర్త మృతిపై అనుమానం ఉందని భార్య నవనీత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి తాళం పగలగొట్టి చోరీ



దొంగల చేతిలో ధ్వంసమైన బీరువా

శివ్వంపేట, జూన్ 13(ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగలగొట్టి వెండి ఆభరణాలు నగదు అపహరించుకు పోయిన సంఘటన శుక్రవారం శివ్వంపేటలో చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాలు మేరకు మండల కేంద్రమైన శివ్వంపేటకు చెందిన కుంట మాధవి గురువారం ఇంటికి తాళం వేసి హత్నూరలో బంధువుల ఇంటికి జాతరకు వెళ్లింది. ఇదే అదునుగా భావించిన దుండగులు గురువారం రాత్రి ఇంటి తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న 53 తులాల వెండి పట్ట గొలుసులు, కడియాలు, 16 వేల నగదును అపహరించుకు పోయారు. దొంగతనాన్ని గుర్తించిన బాధితురాలు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు ఘటనా స్థలానికి ఆధారాలు సేకరించారు.

విమాన ప్రమాద మృతులకు నివాళి

హుస్నాబాద్ టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : అహ్మదాబాద్‌లో విమానం కుప్ప కూలిన ఘటన మృతులకు బీజేపీ నాయకులు నివాళులర్పించారు. శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపాని చిత్ర పటం ఏర్పాటు చేసి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మాజీ సీఎం విజయ్ రూపాని మరణం బీజేపీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు బత్తుల శంకర్‌బాబు, నాయకులు బొంగోని శ్రీధర్‌గౌడ్, వెల్దండి సంతోష్, అశాడపు శ్రీనివాస్, గాదాసు రాంప్రసాద్, కంది సతీష్ రెడ్డి, సాయికుమార్, అశోక్ తదితరులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

స్ఫూర్తి ప్రదాతలు

నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం


- రక్తమిచ్చి ప్రాణాలు కాపాడుతున్న దాతలు
- ఒక్కొక్కరు పదుల సార్లు రక్తదానం

కొండపాక/హుస్నాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చేరి సకాలంలో రక్తం అందక చనిపోయే వారు చాలామందే ఉన్నారు. ఇలాంటి సమయంలో మనమిచ్చే రక్తం ఎంతోమంది ప్రాణాలు కాపాడుతుంది. అందుకే అన్ని దానాల కన్నా రక్త దానం గొప్పది అంటుంటారు. అంతేకాదు ఇది ప్రాణదానంతో సమానం. ఈ నేపథ్యంలో ఎందరో దాతలు స్వచ్ఛందంగా ముందుకువచ్చి రక్తదానం చేస్తూ చేయిస్తూ స్ఫూర్తి ప్రదాతలు నిలుస్తున్నారు. ఎవరైనా ఆపదలో ఉండి రక్తం అవసరముందంటే చాలు క్షణాల్లో అక్కడికి చేరుకుని రక్తమిస్తున్న ఆపద్బాంధవులవుతున్నారు.

వాట్సాప్‌లో ప్రత్యేక గ్రూపులు...

రక్తదాతలు కొంతమంది వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకుని అసవరమైనవారికి రక్తదానం చేస్తున్నారు. సమాచారం అందిన వెంటనే ఏ గ్రూపు రక్తమైనా వ్యాట్సాప్ గ్రూప్‌లోని సభ్యులు వెళ్లి రక్తం ఇస్తూ దాతృత్వం చాటుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించిన ఈ వాట్సాప్ గ్రూపులో 120 మంది వరకు రక్తదాతలు ఉన్నారు. వ్యాపారాత్మకం కాకుండా అవసరం ఉన్న వారికి మాత్రమే రక్తదానం చేస్తున్నారు.







రక్తదానం చేస్తున్న ప్రశాంత్, దాసరి చంద్రశేఖర్

యువతలో చైతన్యం అవసరం

రక్తదానంపై యువతలో ఇప్పటికీ అపోహలు ఉన్నాయి. పదే పదే రక్తమిస్తే అనారోగ్యం బారిన పడుతామోనన్న భయంతో ముందుకు రావడం లేదు. ' 18 నుంచి 55 ఏళ్ల మధ్య వయస్సుగల వారు రక్తం ఇవ్వవచ్చు.. ప్రతీ మూడు నెలలకోసారి రక్తం ఇవ్వడం వల్ల ఎలాంటి నష్టం ఉండదు.. రక్తం దానం చేసిన 24 గంటల్లోపు కోల్పోయిన శక్తి తిరిగి వస్తుంది.. మనిషిలో ఆరువేల మిల్లీ లీటర్ల రక్తం ఉంటుంది.. దాతల నుంచి 300 మిల్లీ లీటర్ల రక్తం మాత్రమే తీసుకుంటారు' అని వైద్యారోగ్యం నిపుణులు పలుమార్లు చెబుతున్నా యువతలో చైతన్యం రావడం లేదు. దీనిపై స్వచ్ఛంద, యువజన సంస్థలు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

పలుమార్లు రక్తదానం చేసినవారు..

● సిద్దిపేట పట్టణానికి చెందిన వరాల ప్రశాంత్‌కుమార్ వర్గల్ మండలంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. 'జీతే జీతే రక్తదాన్, జాతే జాతే అవయవదాన్' అనే నినాదంతో రక్తదాన శిబిరాలు, అవయవదానంపై అవగాహన కార్యక్రమాలు చేపడుతూ ప్రజలను భాగస్వాములను చేస్తున్నాడు. ప్రశాంత్‌కుమార్ ఇప్పటివరకు 73 సార్లు రక్తదానం చేశాడు.

● సిద్దిపేటకు పట్టణానికి చెందిన దాసరి చంద్రశేఖర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో పోలీస్ కానిస్టేబుల్ విధులు నిర్వహిస్తున్నాడు. సుమారు 64 సార్లు రక్తదానం చేశాడు.

● పెద్దమాసాన్‌పల్లిలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి 31 సార్లు రక్తమిచ్చాడు. ఆయన రక్తం ఏబీ నెగిటివ్. ఇది అతి తక్కువ మందిలో ఉంటుంది.

● హుస్నాబాద్ మున్సిపాలిటీలో సాధారణ కార్మికుడిగా పని చేస్తున్న పైసా శ్రీకాంత్ ఇప్పటివరకు 60 సార్లు రక్తదానం చేశారు. తమకు వాట్సాప్ గ్రూప్ ఉందని, ఇందులో 200 మందిమి రక్తదాతలం ఉంటామన్నారు. 2023 సంవత్సరంలో డిల్లీలో జరిగిన బహుజన బంధువు అవార్డులలో ఉత్తమ సేవా అవార్డు తీసుకున్నారు.

14 సార్లు రక్తమిచ్చాను..



అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి రక్తం అందివ్వడం తన భర్త చంద్రశేఖర్ స్ఫూర్తి. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి సరైన సమయానికి రక్తం అందిస్తే వారు బతుకుతారు. ఆయన బాటలోనే నేనూ రక్తదానం చేస్తున్నాను. ఇప్పటివరకు 14 సార్లు రక్తమిచ్చాను.

-రేఖా ప్రియదర్శిని, సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి నర్సింగ్ ఆఫీసర్ సిద్దిపేట

ప్రాణాలు కాపాడానన్న సంతృప్తి..



రక్తం ఇచ్చి ప్రాణాలు కాపాడిన అనే సంతృప్తి అమూల్యమైనది. ప్రత్యేక శిబిరాలతో పాటు అవసరం ఉన్నవారికి రక్తం ఇస్తున్నాను. ఇప్పటికీ 34 సార్లు రక్తం ఇచ్చాను.

-గొడుగు రాజు, ముద్దాపూర్

రక్తదానమంటే ఇష్టం..



ఉన్నది ఒకటే జీవితం. ఎవ్వరికి నచ్చిన పని వారు చేస్తారు. నాకు ఆపదలో రక్తం లేక బాధపడే వారికి బ్లడ్ ఇవ్వడం ఇష్టం. నాది బ్లడ్ గ్రూప్ ఓ నెగిటీవ్. ఇప్పటి వరకు 19 సార్లు రక్తదానం చేశాను.

-పిన్న రమేశ్, గోవర్ధనగిరి

40 మంది మెడికోల రక్తదానం



సంగారెడ్డి అర్బన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి) : ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థులు శుక్రవారం రక్తదానం చేశారు. సంగారెడ్డిలోని జీజీహెచ్ బ్లడ్‌బ్యాంకులో 40 మంది మెడికోలు రక్తదానం చేశారు. సూపరింటెండెంట్ డా.అనీల్‌కుమార్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని తెలిపారు. మంచి ఉద్దేశంతో మెడికోలు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డా.వీరాంజనేయులు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ డా.సందీప్, మెడికల్ ఆఫీసర్ డా.గోవింద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐలో..



సిద్దిపేట అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 70వ వార్షికోత్సవం సందర్భంగా సిద్దిపేట రీజనల్ ఆఫీస్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 110 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ మారుతి, డాక్టర్ సునీల్ చౌదరి, ఆఫీసర్స్ అసోసియేషన్ ఏఓ, హైదరాబాద్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ నర్ర సంతోష్, యూనియన్ లీడర్ రామకృష్ణ, ఏజీఎస్ అసోసియేషన్ రీజినల్ సెక్రటరీ క్రాంతి, ఆఫీసర్స్ సంతోష్, బీమా, అనిల్ కుమార్, నరేష్ పాల్గొన్నారు.

వియత్నాం విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్న గీతం అధ్యాపకుడు



డాక్టర్ నిరంజన్ అప్పస్వామి

పటాన్‌చెరు రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని సీఎస్ఈ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నిరంజన్ అప్పస్వామి వియత్నాం విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీపై శిక్షణ ఇవ్వనున్నారు. హోచిమిన్ సిటీలోని వియెన్ డాంగ్ కళాశాల సైబర్ సెక్యూరిటీపై రెండు వారాల కార్యశాల నిర్వహించడానికి ఆయనను అధికారికంగా ఆహ్వానించింది. దీనిని జూన్ 16 నుంచి జూలై 1, 2025 మధ్య నిర్వహించనున్నారు. వియత్నాంలో శిక్షణతో పాటు బోధించే అవకాశం అందుకున్న డాక్టర్ నిరంజన్‌ను గీతం ఉన్నతాధికారులు అభినందించి, అంతర్జాతీయ విద్యా కార్యకలాపాలలో ఆయన విజయం కొనసాగాలని అభిలాషించారు.

మూడేళ్లకు తెరుచుకున్న పాఠశాల



పాఠాలు బోధిస్తున్న టీచర్

తూప్రాన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా తూప్రాన్ మండలం వట్టూరు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయులు సక్రమంగా రాకపోవడంతో విద్యార్థులను ప్రైవేటులో చేర్పించారు. దాంతో విద్యార్థులు లేకపోవడంతో మూడేళ్ల క్రితం పాఠశాలను మూసివేశారు. బడిని తిరిగి తెరిపించాలని గ్రామస్థులు కొందరు కోరాగా, మండల విద్యాధికారి డాక్టర్ పర్వతి సత్యనారాయణ చొరవతో గురువారం పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. శుక్రవారం 28 మంది విద్యార్థులను తల్లిదండ్రులు చేర్పించారు. వట్టూరు పాఠశాల ఉపాధ్యాయురాలు అఖిల విధులకు హాజరై విద్యార్థులకు తరగతులు బోధించారు. మూడేళ్లకు పాఠశాల పునఃప్రారంభం కావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

దేశానికి కమ్యూనిస్టుల అవసరం ఉంది

- కేంద్ర ప్రభుత్వం ప్రజలను ఊహల్లో విహరింపజేస్తున్నది
- విమాన ప్రమాదంపై విచారణ జరిపించాలి
- సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూనంనేని..



ఎడ్ల గురువారెడ్డి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న సాంబశివరావు

సిద్దిపేట అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రజలకు కమ్యూనిస్టుల అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. కమ్యూనిస్టులను, మావోయిస్టులను అణచివేయాలని చూస్తున్న ప్రభుత్వం ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని అన్నారు. సిద్దిపేట మొదటి ఎమ్మెల్యే సీపీఐకి చెందిన ఎడ్ల గురువారెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయన విగ్రహానికి కూనంనేని పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలను ఊహల్లో విహరింపజేయిస్తోందన్నారు. విద్య, వైద్యం అందించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం దురదృష్టకరమని, దీనిపై తగిన విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. 'కాళేశ్వరం డిజైన్ నేనే చేశాను.. అన్ని నేనే' అని చెప్పుకున్న కేసీఆర్ ఇప్పుడు తనకేమీ తెలియదు అనడం ఆశ్చర్యంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వాగ్దానాలను నెరవేర్చాలన్నారు. సీపీ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఖమ్మంలో డిసెంబరు 26వ తేదీన 5 లక్షల మందితో భారీ సభ నిర్వహించనున్నామని తెలిపారు. ఆయన వెంట సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, నాయకులు లక్ష్మణ్, శంకర్, బన్సీలాల్, ఆరీఫ్, సత్యనారాయణ, మల్లేశం, చంద్రం, ప్రసన్నకుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

లాభసాటి వ్యవసాయంతోనే దేశ సమగ్రాభివృద్ధి

- జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్



మాట్లాడుతున్న జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్

కోహీర్, జూన్ 13: (ఆంధ్రజ్యోతి) : దేశంలో లాభసాటి వ్యవసాయం పెరిగినప్పుడే దేశ సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్ పేర్కొన్నారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని బిలాల్‌పూర్ రైతు వేదికల్లో నిర్వహించిన రైతు ముంగిట్లోకి-వ్యవసాయ శాస్త్రవేత్తలు ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం ద్వారా రైతులకు పంటల సాగులో అందించిన మెళకువలు ఎంతగానో దోహదపడతాయ న్నారు. జహీరాబాద్ ప్రాంతంలో చెరుకు రైతులను దృష్టిలో ఉంచుకొని ఇక్కడ మళ్లీ నూతన చక్కర పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రికి దృష్టికి తీసుకెళ్లామన్నారు. అల్లం, ఆలుగడ్డ పంటల నిల్వ కొరకు కోల్డ్ స్టోరేజీలను ఏర్పాటు చేయాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ జానయ్యను కోరారు. కలుపు తీసే యంత్రాలను సబ్సిడీ పై అందజేయాలని కోరారు. చదువుకున్న వారు కూడా వ్యవసాయం చేయాలని చూపాలని పీజేటీఏయూ వైస్ చాన్సలర్ జానయ్య ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ ఇన్‌చార్జి, మాజీ మంత్రి చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రామలింగారెడ్డి, మాజీ జడ్పీటీసీ జి.రామదాసు, ఏఈఓ నవీన్‌కుమార్ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకటరెడ్డి

పేద ప్రజల పక్షాన పోరాడేది ఎర్రజెండానే

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజల పక్షాన ఉంటూ వారి సమస్యలపై నిరంతరం పోరాడేది ఎర్రజెండానేనని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలోని అనభేరి, సింగిరెడ్డి భవనంలో ఈ నెల 27వ తేదీన నిర్వహించే సీపీఐ జిల్లా మహాసభల ఆహ్వాన సంఘ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను అతి కిరాతకంగా చంపుతూ, ఆదివాసీలను చిత్రహింసలకు గురి చేస్తున్నదని తెలిపారు. దేశంలో స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, హరించబడుతున్న హక్కుల కోసం పోరాడుతున్న మవోయిస్టులను చంపడమేమిటని ప్రశ్నించారు. వెంటనే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శిగా హుస్నాబాద్ మండల కార్యదర్శి మల్లేశ్, ఉపాధ్యక్షులుగా సత్యనారాయణగౌడ్, వెంకటరెడ్డి, లక్ష్మణ్, శంకర్, వనేష్, అశోక్, కోశాధికారిగి ఎగ్గోజు సుదర్శనచారిలను నియమించారు. సీపీఐ హుస్నాబాద్ మండల కార్యదర్శిగా గడిపె మల్లేశ్ మరోసారి ఎన్నుకున్నారు. పట్టణ కార్యదర్శిగా సుదర్శనచారిని ఎన్నుకున్నారు.

డీఈఐసీని సందర్శించిన యూనిసెఫ్ బృందం

- చిన్నారులకు అందించే వైద్య సేవలపై ఆరా



సంగారెడ్డిలోని డీఈఐసీ సెంటర్‌ను సందర్శించిన యూనిసెఫ్ బృందం

సంగారెడ్డి అర్బన్/కొండాపూర్, జూన్ 13(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జీజీహెచ్ ప్రాంగణంలోని డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్(డీఈఐసీ)ను శుక్రవారం యూనిసెఫ్ బృందం సందర్శించింది. యూనిసెఫ్ ప్రతినిధులు డా.జలీమ్‌టపెసి, డా.శ్రీధర్, డా.సీమ, డా.కిరణ్‌లతో కూడిన బృందం డీఈఐసీలో పలు విభాగాలను కలియ తిరిగి పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. డీఈఐసీకి ఎటువంటి సమస్యలతో చిన్నారులు వస్తుంటారు, ఎక్కడి నుంచి వస్తారు, ఎవరు తీసుకొస్తారు, చికిత్స విధానాలు, రెఫర్ తదితర వివరాలను క్షుణంగా అడిగి తెలుసుకున్నారు. యూనిసెఫ్ బృందం సభ్యులు అడిగిన ప్రశ్నలకు డీఈఐసీ వైద్యులు, సిబ్బంది సవివరంగా సమాధానాలిచ్చారు. అలాగే కొండాపూర్ మండలం గొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని యూనిసెఫ్ బృందం సందర్శించింది. కేంద్రాలలో నిర్వాహకుల పనితీరు సేవలను అడిగి తెలుసుకున్నారు. సంపూర్ణ పౌషకహారంతో పాటు వారానికి రెండు రోజుల ఎగ్ బిర్యాని అందిస్తున్న విషయాన్ని పోషకులకు తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. కొత్తగా అడ్మిషన్ తీసుకున్న చిన్నారులకు తల్లులచే సీడీపీవో చంద్రకళ, సూపర్‌వైజర్ శ్యామల అక్షరాభ్యాసం చేయించారు. ఆయా కార్యక్రమంలో డీఐవో డా.మనోహర్‌రెడ్డి, పీడీయాట్రిక్స్ డా.మధుసుధన్‌రెడ్డి, యూనిసెఫ్ బృందం సభ్యులు కిరణ్, సిమన్‌శ్రీధర్, జిలలీమ్, అంగన్‌వాడీ టీచర్లు అరుణ, శ్యామల, ఆయాలు అనిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో సిద్దిపేట అధ్యాపకుడి ప్రతిభ



అధ్యాపకుడు సయ్యద్ సంధాని

సిద్దిపేట కల్చరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయిలో ప్రచురితమైన సక్సెస్‌ఫుల్ స్కూల్ లీడర్‌షిప్ 2025-26 మ్యాగజైన్‌లో సిద్దిపేట జిల్లాకు చెందిన అధ్యాపకుడు సయ్యద్ సంధాని ప్రతిభ ప్రచురితమైంది. జాతీయ స్థాయిలో న్యూఢిల్లీలో జరిగిన ఎగ్జాంప్లర్స్ ఆఫ్ చేంజ్ అండ్ ఇన్నోవేషన్ 2025 అనే జాతీయస్థాయి సదస్సులో పాల్గొని తన వినూత్న బోధన విధానాన్ని ప్రదర్శించినందుకు గాను జాతీయస్థాయి మ్యాగజైన్‌లో సిద్దిపేటకు చెందిన సయ్యద్ సంధాని చోటు సంపాదించారు. ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా బోధనలో నిష్ణాతులైన ప్రతిభావంతులైన ఉపాధ్యాయుల ప్రతిభను వారు చేసే విద్యా విషయక వినూత్న కార్యక్రమాలను జాతీయస్థాయి మ్యాగజైన్‌లో ప్రచురిస్తారు. ఈ సంవత్సరం 57 మంది ఉపాధ్యాయులు పాల్గొనగా వారిలో సంధాని కూడా ఉన్నారు. ఈ సందర్భంగా సయ్యద్ సంధానికి జిల్లా విద్యాధికారులు, మండల విద్యాధికారులు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.



ఆరుద్ర ఆగమనం

ఆరుద్ర పురుగులు రాక రైతులకు శుభసూచకమని అంటుంటారు. శుక్రవారం పాపన్నపేట మండంలో ఆరుద్ర పురుగులు కబడడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేశారు. చూడటానికి అరుణ వరుణంలో చాలా ముచ్చటగా ఉండడంతో పలువురు ఆసక్తిగా చూశారు. కేవలం ఆరుద్ర కార్తెలో మాత్రమే ఇవి కనిపించనుండడంతో వీటికి ఆ పేరు వచ్చినట్లు చెప్పుకుంటారు. ఇవి రైతులకు ఎంతో మేలు చేస్తాయి. పర్యావరణ నేస్తాలుగా వీటిని పిలుస్తారు. ఇవి నేలల్లోని చీడ పురుగుల లార్వాలను తిని పంట వేయకముందే రైతుకు మేలు చేకూరుస్తాయి. ఇవి పొలంలో కనిపిస్తే. రైతులు ఎంతో సంబరపడిపోతారు.

- పాపన్నపేట , జూన్ 13 (ఆంధ్రజ్యోతి)



వర్గల్‌లో నిరుపయోగంగా ఆర్అండ్ బీ అతిథి గృహం



ధ్వసంమైన కిటికీఅద్దాలు



అతిథి గృహం ఆవరణలో ఖాళీ మద్యం సిసాలు, ప్లాస్టిక్ గ్లాసులు



శిథిలావస్థకు చేరుకున్న ఫర్నిచర్

అసాంఘిక కార్యక్రమాలకు 'అతిథి' గృహం

వర్గల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ మండల కేంద్రంలోని విద్యా సరస్వతీ అమ్మవారి ఆలయ సమీపంలో ఏళ్ల క్రితం నిర్మించిన ఆర్అండ్ బీ అతిథి గృహం నిర్వహణ లోపంతో శిథిలావస్థకు చేరుకుంటున్నది. విద్యాధరి క్షేత్రంలోని విద్యా సరస్వతీ అమ్మవారి ఆలయానికి భక్తులు, పర్యాటకులు అధికంగా వస్తుండటంతో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి పర్యాటక శాఖ మంత్రి డాగీతారెడ్డి సుమారు రూ.కోటితో 18 ఏళ్ల క్రితం నిర్మించి ప్రారంభించారు. అయినా ఇప్పటికీ వినియోగించడంలేదు. దీంతో ఈ భవనం తలుపులు, కిటికిలు, వస్తువులు, ఫర్నిచర్, సామగ్రి పూర్తి ధ్వంసమయ్యాయి. ప్రభుత్వం మారిన ప్రతిసారి కొందరు సంబంధిత శాఖ అధికారులు ప్రహరీ సక్రమంగా లేదని, వాస్తు దోషం ఉందన్న కారణంతో చిన్న చిన్న మరమ్మతులు చేయిస్తూ వస్తున్నా వినియోగంలోకి మాత్రం తేవడంలేదు. దీంతో ఇందులోని నల్లాలు, వాటర్ ట్యాంకు, ఎలక్ట్రికల్ బల్బులు, ఫ్యాన్లు దుండగులు దోచుకెళ్లారు. అంతేకాకుండా తాగుబోతులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అతిథి గృహానికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు

డ్రంకెన్ డ్రైవ్‌లో 26 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో 26 మందికి జరిమానా విధించారు. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తన సిబ్బందితో కొన్ని రోజుల క్రితం సిద్దిపేట పట్టణంలో నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తాలలో, రాజీవ్ రహదారిపై వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో 26మంది మద్యం తాగి వాహనాలు నడుపుతుండగా పట్టుకున్నారు. వారిని శుక్రవారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపరచగా విచారణ చేసి 26 మందికి రూ.40,000 జరిమానా విధించారు.

ట్రాక్టర్ చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

ములుగు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ దొంగిలించిన ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. రెండు రోజుల క్రితం ములుగులో తన్నీరు నర్సింలుకు చెందిన డోజర్ ట్రాక్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించారు. శుక్రవారం ములుగు మండలం కొట్యాల గ్రామ శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా ములుగులో డోజర్ ట్రాక్టరు దొంగిలించినట్లు ఒప్పుకున్నారు. దీంతో వర్గల్ మండల కేంద్రానికి చెందిన బడే మహేందర్(22), మర్కుక్ గ్రామానికి చెందిన గంధమాల మహేష్(45)లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

చంద్రం మృతి కాంగ్రెస్‌కి తీరని లోటు

దుబ్బాక, జూన్13 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక సీనియర్ నాయకుడు, దుబ్బాక మున్సిపల్ ప్రధానకార్యదర్శి తోట్ల చంద్రం మృతి పార్టీకి తీరని లోటని కాంగ్రెస్‌పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం కాంగ్రెస్ నాయకుడు చంద్రం మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ జెండాను కప్పి నివాళులు అర్పించారు. చంద్రం కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

బైరాన్‌పల్లి, లద్నూరు గ్రామాల్లో వైద్య శిబిరాలు

మద్దూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ధూళిమిట్ట మండలం బైరాన్‌పల్లి, మద్దూరు మండలం లద్నూరు గ్రామాల్లో శుక్రవారం వైద్య శిబిరాలు నిర్వహించినట్లు పల్లె దవాఖానా వైద్యాధికారి స్టువర్డసన్ తెలిపారు. ఈ సందర్భంగా ఎన్‌సీడీ స్క్రీనింగ్ నిర్వహించినట్లు తెలిపారు. అధిక రక్తపోటు, మధుమేహం కేసులను గుర్తించి పీహెచ్‌సీలకు రిఫర్ చేసినట్లు తెలిపారు. అనంతరం రక్త నమూనాలు సేకరించినట్లు తెలిపారు.


రైతు భరోసాకు దరఖాస్తు

మద్దూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని ఏవో బూరెల రామకృష్ణ తెలిపారు. శుక్రవారం ఈ విషయమై ఏవో మాట్లాడారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా వివరాల జిరాక్స్‌లను ఈ నెల 20లోపు వ్యవసాయ విస్తరణాధికారులకు అందించాల్సి ఉంటుందని తెలిపారు. గతంలో రైతు భరోసా పొందిన వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిద్దిపేట , జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట పట్టణంలోని అన్నీ వార్డులతో పాటు సిద్దిపేట అర్బన్, రూరల్ మండలాల్లోని అన్ని గ్రామాలు, సిద్దిపేటలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని సిద్దిపేట డివిజన్ ఇంజనీర్ (డీఈ) కె. రామచంద్రయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిద్దిపేటలోని 132/33 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతు కారణంగా ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు దాదాపు నాలుగు గంటల మేర విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయమై ఆయా పట్టణ, మండలాలు, గ్రామాల ప్రజలు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

చిన్నారుల మలి ఒడి అంగన్‌వాడీ



చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఎగ్ బిర్యానీ వడ్డిస్తున్న సీడీపీవో

చిన్నకోడూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : చిన్నారులకు తొలి ఒడి అమ్మ ఒడి అయితే మలి ఒడి అంగన్‌వాడీ అని సిద్దిపేట ప్రాజెక్టు సీడీపీవో శారదా దేవి పేర్కొన్నారు. మండలంలోని అల్లీపూర్ అంగన్‌వాడీ కేంద్రం-1లో శుక్రవారం అమ్మ మాట - అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గర్భిణీలు, బాలింతలు పోషకాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అనంతరం చిన్నారులకు, బాలింతలకు, గర్భిణీలకు ఎగ్ బిర్యానీ పెట్టారు. కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్‌లు మహాలక్ష్మి, భాగ్యలక్ష్మి, పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ స్టాండ్‌గా మారిన బస్‌షెల్టర్



నంగునూరు మండలం రాంపూర్ క్రాసింగ్ వద్ద బస్ షెల్టర్‌లో పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలు

నంగునూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్సు షెల్టర్‌లో పార్కింగ్ స్టాండ్ తలపించేలా ద్విచక్ర వాహనాలు పెట్టి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నారు. సిద్దిపేట-హనుమకొండ రహదారిలోని రాంపూర్ చౌరస్తా వద్ద ప్రజల కోసం నిర్మించిన బస్సు షెల్టర్‌లో ద్విచక్ర వాహనాలను పెట్టడం వల్ల ప్రయాణికులు నిలబడే అవకాశం లేక ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాంపూర్, జేపీతండా, దర్గపల్లి, మగ్దుంపూర్, నంగునూరు తదితర ప్రాంతాల నుంచి సిద్దిపేట, హనుమకొండకు వెళ్లే ప్రయాణికులు తమ వాహనాలను బస్సు షెల్టర్ లో పెట్టి వెళ్తున్నారు. దీంతో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం ప్రారంభమైనందున వెంటనే బస్సు షెల్టర్ లో ఉన్న ద్విచక్ర వాహనాలను ఖాళీ చేయించాలని పరిసర ప్రాంతాల ప్రయాణికులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గజ్వేల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ నరసయ్య అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీలో వంద రోజుల కార్యక్రమాల్లో భాగంగా రాజీవ్‌పార్కు క్లీనింగ్, పబ్లిక్ ఏరియాల్లో చెత్త, నిల్వ ఉన్న నీటిని తొలగించడంపై అవగాహన కల్పించారు. వార్డుల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు తడి, పొడి చెత్త వేరు చేయు విధానాన్ని గురించి అవగాహన కల్పించారు. పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించి, పీపీఈ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మేనేజర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ టాస్క్ ఫోర్స్ తనిఖీ

సిద్దిపేట రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సరైన రికార్డులు లేకుండా వరి విత్తన ప్రాసెసింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని దుబ్బాక ఏడీఏ మల్లయ్య, టాస్క్ ఫోర్స్ సీఐ అంజయ్య హెచ్చరించారు. శుక్రవారం సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు గ్రామంలోని జై కిసాన్ సీడ్స్ - వరి ప్రాసెసింగ్ ప్లాంట్‌లో వ్యవసాయ శాఖ, టాస్క్ ఫోర్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ప్లాంట్‌లో రికార్డులు పరిశీలించగా సరైన రికార్డులు లేకపోవడంతో ఆ పాంట్లో ఉన్న రూ.8,99,050ల విలువ చేసే వరి విత్తనాల విక్రయాలను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. సరైన రికార్డులు లేకుండా విత్తనాల ప్రాసెసింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటమని, ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే లైసెన్స్ రద్దు చేస్తామని పెర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ బహూకరణ



ఇటిక్యాల గ్రామంలో పాఠశాలకు టీవీని అందజేస్తున్న మాజీ సర్పంచ్ చంద్రశేఖర్

జగదేవ్‌పూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండలంలోని ఇటిక్యాల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గ్రామ మాజీ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్‌గుప్త టీవీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు డిజిటల్ క్లాసులు అందించాలని ఉద్దేశంతో టీవీని అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శంకర్, మాజీ ఎంపీపీ బాలేశంగౌడ్, పిఎసిఎస్ చైర్మెన్ ఇంద్రసేనారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పిస్తే ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తాం

మద్దూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : బస్సు సౌకర్యం లేక తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించలేక ఆర్థిక భారమైనా ప్రైవేటు పాఠశాలలకు పంపించాల్సి వస్తోందని మండలంలోని వంగపల్లి గ్రామ శివారు ఉప్పరోనిగడ్డ గ్రామస్థులు వాపోతున్నారు. శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామాన్ని సందర్శించిన రేబర్తి ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం బాకీ చంద్రభానుకు రవాణా సమస్యలపై గ్రామస్థులు ఏకవరువు పెట్టారు. ఈ సందర్భంగా చంద్రభాను మాట్లాడారు. గ్రామాలకు రవాణా సౌకర్యాలు లేక చాలా గ్రామాల్లో గ్రామస్థులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తున్నట్లు తెలిసిందన్నారు. సరైన రవాణా సౌకర్యం ఉంటే తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని గ్రామస్థులు తెలుపగా ఈ విషయమై ఆర్టీసీ అధికారులకు విన్నవించడంతో పాటు రవాణా సౌకర్యంపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు



చెత్తా చెదారాన్ని తొలగిస్తున్న కమిషనర్ మల్లిఖార్జున్, సిబ్బంది

హుస్నాబాద్ టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీల్లో 100 రోజుల కార్యక్రమాల్లో భాగంగా హుస్నాబాద్ పట్టణంలో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని 16వ వార్డులో నీరు నిలువ చోట దోమ లార్వా పెరగకుండా ఆయిల్ బాల్స్ స్ప్రే, బ్లీచింగ్ చల్లారు. పట్టణంలోని మార్కెట్ రోడ్డులో మురికి కాలువలను శుభ్రం చేయించారు. చెత్త విభజనపై సిక్క వాడ ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలందరూ స్వచ్ఛత పాటించాలని, నిల్వ ఉన్న నీటిని తొలగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి రవికుమార్, సాంబరాజు, శివకుమార్, మమత, సారయ్య తదితరులున్నారు.

భారతీయ యోగా ప్రపంచానికి ఆదర్శం



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రేవతి

సిద్దిపేట కల్చరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : భారతీయ అపూర్వ వైద్య సంపద యోగా వైపు ప్రపంచమంతా దృష్టి సారిస్తుంటే మనము మాత్రం పాశ్చాత్య సంస్కృతి వైపు చూస్తూ అనారోగ్యాలకు దగ్గరవుతున్నామని సిద్దిపేట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రేవతి అన్నారు. సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్, వ్యాస మహర్షి యోగా సొసైటీ, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం సిద్దిపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఉచిత యోగా శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ భవిష్యత్తులో నర్సింగ్ విద్యార్థులు రోగులకు సేవ చేసే సమయంలో యోగాను కూడా వినియోగిస్తే అద్భుత ఫలితాలు ఉంటాయన్నారు. ముఖ్యంగా మహిళలు ఆపరేషన్లు కాకుండా సుఖ ప్రసవాలు కావడానికి అవసరమైన ప్రత్యేక యోగా శిక్షణను పొందాలని సూచించారు. కార్యక్రమానికి సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు తోట అశోక్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ దీప్తి నాగరాజు ప్రెస్ అకాడమీ పూర్వ సభ్యులు కే. అంజయ్య , జ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శిభా, వైస్ ప్రిన్సిపల్ విజయ కుమారి, లెక్చరర్ సుప్రియ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అనూష, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇక శాశ్వత తాగునీరు

(3వ పేజీ తరువాయి)

ఏమాత్రమ అవసరం ఉండదు. మల్లన్నసాగర్ ద్వారా నేరుగా నీటిని తరలించవచ్చు. ఇది అందుబాటులోకి వస్తే సమీప భవిష్యత్తులో తాగునీటి కష్టాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ప్రణాళికతో ముందుకు కదులుతుంది.

ఇప్పటికే పూర్తయిన డ్రై-రన్, వెట్-రన్



మల్లన్నసాగర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి పూర్తయిన పైపులైన్

అక్కారం వద్ద నిర్మించిన పంప్‌హౌజ్ గత ప్రభుత్వంలోనే దాదాపుగా పూర్తవగా, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మిగిలిన పనులను పూర్తి చేశారు. ఈ క్రమంలో గత మే మొదటి వారంలో పంప్‌హౌజ్ డ్రైరన్‌ను నిర్వహించడంతో పాటు ఏప్రిల్ 2వ వారంలో మల్లన్నసాగర్ భూనిర్వాసిత కాలనీకి వచ్చే పైపులైన్‌ను వెట్‌రన్‌ను పూర్తి చేశారు. డ్రై-రన్, వెట్-రన్ విజయవంతమైందని కొండపాక డీఈ నాగార్జున తెలిపారు. ఒక్కసారి 400 మీటర్ల పైపులైన్ పూర్తి చేయగానే నీటిని ఆయా నియోజకవర్గాలకు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

మంత్రులను కలిసిన బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి, జూన్13 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ప్రమాణస్వీకారం చేసిన రాష్ట్ర మంత్రులు వివేక్‌వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మన్‌లను శుక్రవారం రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ బక్కి వెంకటయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మంత్రులకు శాలువతో సన్మానించి, శుభాకాంక్షలను తెలియజేశారు.

బీజేపీ జెండా ఎగురవేద్దాం

గజ్వేల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీపై బీజేపీ జెండా ఎగుర వేద్దామని బీజేపీ పట్టణాధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్ పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర బీజేపీ శాఖ, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడి ఆదేశాల మేరకు పట్టణంలోని ఆయా బూత్‌లలో నూతన శక్తి కేంద్రాల ప్రముఖ్(ఇన్‌చార్జి)లను నియమించినట్లు ఆయన తెలిపారు. ప్రముఖులుగా పూర నరసింహగౌడ్, గొల్లపల్లి కుమార్, మఠం ప్రమథనాథ్, దేవేందర్‌లను నియమించినట్లు తెలిపారు.

'భూ భారతి' కౌంటర్లు ఏర్పాటు చేయాలి


● కిసాన్ సంఘ్ డివిజన్ ఇన్‌చార్జి వేణుగోపాల్‌రెడ్డి

హుస్నాబాద్ టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : భూ భారతి ఫిర్యాదులు స్వీకరించేందుకు తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని కిసాన్ సంఘ్ హుస్నాబాద్ డివిజన్ ఇంచార్జి కవ్వ వేణుగోపాల్‌రెడ్డి అధికారులను కోరారు. ఈ విషయంపై ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో భూ భారతి సదస్సులు ఏర్పాటు చేసినప్పుడు కొన్ని కారణాల వల్ల అక్కడ లేని రైతులకు మళ్ళీ తమ సమస్యలపై ఫిర్యాదులు చేసుకోవడానికి అవకాశం లేకుండా పోతుందని, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లయితే మళ్లీ తమ సమస్యలు చెప్పుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు.

ఊరూరా ముమ్మరంగా అక్షరాభ్యాసాలు

కొండపాక/మిరుదొడ్డి/రాయపోల్/చేర్యాల/కుకునూరుపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలలో చేరే పిల్లలకు అధికారులు, తల్లిదండ్రులు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. శుక్రవారం కుకునూరుపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన ప్రాథమిక పాఠశాలలో చేరే పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. చేర్యాల మండలం శబాషీగూడెం ఎంపీపీఎస్‌లో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం టెంకంపేట, తిమ్మకపల్లి, ఆరెపల్లి తదితర గ్రామాల్లో ముమ్మరంగా సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారుఅక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులు విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు పలకలను అందజేసి, అక్షరాభ్యాస కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి విద్యార్థికి ప్రాథమిక పాఠశాల కీలకమైందని కొండపాక ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి అన్నారు కొండపాక మండలం దుద్దెడ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక దశలో నేర్చుకున్న అంశాలు భావి జీవితానికి బాగా ఉపయోగపడతాయన్నారు.

మంత్రులను కలిసిన చేర్యాల మాజీ జడ్పీటీసీ



మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కలిసిన చేర్యాల మాజీ జడ్పీటీసీ

చేర్యాల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు శుక్రవారం మంత్రులు వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లను భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి మర్యాదపూర్వకంగా కలిసారు. చేర్యాల, మద్దూరు ఉమ్మడి మండలాల అభివృద్ధికి సహకరించాలని విన్నవించారు. ఆయనవెంట మల్‌రెడ్డి రాంరెడ్డి, కాశెట్టి ఉపేందర్ తదితరులున్నారు.

గురువారెడ్డి చదువు విలువ తెలిసిన వ్యక్తి

సిద్దిపేట కల్చరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట తొలి శాసన సభ్యుడు, డిగ్రీ కళాశాల వ్యవస్థాపక సభ్యుడు ఎడ్ల గురువారెడ్డి 14వ వర్ధంతి నిర్వహించారు. శుక్రవారం సిద్దిపేట డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన అన్న కుమారులు వెంకటరామిరెడ్డి, రామచంద్రరావు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పాపిరెడ్డి, కార్యదర్శి డాక్టర్ నందిని సిద్ధారెడ్డి పాల్గొన్నారు. చదువు విలువ తెలిసిన వ్యక్తి అయిన గురువారెడ్డి సిద్దిపేటలో డిగ్రీ కళాశాల స్థాపించేందుకు కృషిచేసి ఈ ప్రాంతంలో లక్షలాది మంది ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుటకు తోడ్పడ్డారని డాక్టర్ నందిని సిద్ధారెడ్డి పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

● డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

చిన్నకోడూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పలు ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు సామూహిక అక్షరభ్యాసం చేయించారు. ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని, రిజిస్టర్‌లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని ఆయన కోరారు. అంతకు ముందు అల్లీపూర్ కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినిలకు యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు.

అవగాహనతోనే టీబీ నిర్మూలన



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

నంగునూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే టీవీ వ్యాధిని నిర్మూలించవచ్చని నర్మెట పల్లె దవఖానా ఎంఎల్‌హెచ్‌పీ శివ కిషోర్ అన్నారు. నంగునూరు మండలం రాజగోపాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నర్మెట్ట గ్రామంలో ఏర్పాటు చేసిన ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ముందుగానే టీబీ వ్యాధిని గుర్తించడం వల్ల వారికి సరైన సమయంలో చికిత్స అందుతుందన్నారు. సకాలంలో వ్యాధిని గుర్తించి వైద్యం చేస్తే ఇతర వ్యాధులు రాకుండా నయం చేయవచ్చన్నారు. గ్రామాల వారిగా క్షేత్రస్థాయిలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి స్థానికంగానే అన్ని పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. అలాగే ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిబిరాల్లో మధుమేహం, హెచ్‌ఐవీ, క్యాన్సర్, గుండె, కిడ్నీ, కాలేయ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించవచ్చు అన్నారు. వ్యాధిని గుర్తించిన వారికి సకాలంలో పరీక్షలు చేసి వైద్యం అందిస్తే ప్రాణాలు కాపాడవచ్చునని తెలిపారు. ఆహారపు అలవాట్లను పాటిస్తూ మద్యం, ధూమపానం వంటి వ్యసనాలకు దూరంగా ఉండటం ద్వారా టీవీ వ్యాధిని నివారించవచ్చని సూచించారు.

కర్ణాటక వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించిన హుస్నాబాద్ కమిటీ



రాయచూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద హుస్నాబాద్ మార్కెట్ కమిటీ సభ్యులు

హుస్నాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్‌ల సందర్శనలో భాగంగా హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు శుక్రవారం వివిధ మార్కెట్లను సందర్శించారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్, మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్లను సందర్శించారు. అలాగే కర్ణాటకలోని రాయచూర్‌లోని వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించి అక్కడి కొనుగోళ్లు, ఇతర అంశాలను తెలుసుకున్నారు. ఇందులో హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ కంది తిరుపతి రెడ్డి, వైస్ చైర్మెన్ బంక చందు, సూపర్ వైజర్ డైరెక్టర్లు తదితరులున్నారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం

గజ్వేల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని టీజీఆర్టీసీ మెదక్ రీజియన్ మేనేజర్ విజయ్‌భాస్కర్ అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బస్ డిపోను ఆయన శుక్రవారం సందర్శించి రికార్డులను పరిశీలించిన అనంతరం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహాలక్ష్మి టికెట్ ప్రవేశపెట్టిన అనంతరం ప్రతి బస్సులో ప్రయాణికులు ఎక్కుతున్నారని, అలాగే ఆర్టీసీ బస్సులలో ప్రయాణం ముద్దు అని, ప్రైవేటు వాహనాల్లో ప్రయాణం వద్దన్నారు. ఆర్టీసీ డిపో ఉద్యోగస్తులకు ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తనకు తెలుపవచ్చని సూచించారు.

18న స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాల ఎంపికలు

గజ్వేల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి గాను 4వ తరగతి ప్రవేశానికి గజ్వేల్ మండల స్థాయి ఎంపికలను ఈ నెల 18న నిర్వహిస్తున్నట్లు గజ్వేల్ మండల విద్యాధికారి యెలగందుల కృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సెలక్షన్స్‌లో పాల్గొనదలచిన విద్యార్థులు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకుని, రిజిస్ట్రేషన్ ఫారం, మూడవ తరగతి ప్రోగ్రెస్ కార్డు, బోనఫైడ్, పాస్‌ఫోటో, ఆధార్‌కార్డుతో ప్రజ్ఞాపూర్ పాఠశాలలో హాజరవ్వాలన్నారు. ఇతర వివరాలకు 9603783280 నెంబరుకు సంప్రదించాలని సూచించారు.

సైబర్ నేరాల పట్ల జాగ్రత్త

చేర్యాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సైబర్‌నేరాల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని హుస్నాబాద్ షీ టీమ్ బృందం సభ్యులు బ్యాకింగ్ సదయ్య, ప్రశాంత్, స్వప్న అన్నారు. చేర్యాల ఎస్‌బీఐ ఏడీబీ బ్రాంచి ఆవరణలో మహిళలకు సైబర్ నేరాలు, సోషల్ మీడియా అనర్థాలు, అపరిచిత వ్యక్తుల ఫోన్‌కాల్స్ ఇతరత్రా అంశాలపట్ల అవగాహన కల్పించారు. ఉచితంగా డబ్బులు వస్తాయని నమ్మజూపినా, బ్యాంకు ఖాతా వివరాలు ఇతరులెవరు అడిగినా చెప్పవద్దని, ఒకవేళ సైబర్‌నేరానికి గురైతే 1930నంబరుకు వెంటనే కాల్‌చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.


చేర్యాల నుంచి యాదాద్రికి పాదయాత్ర



చేర్యాల నుంచి యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వరకు పాదయాత్ర చేస్తున్న భూమిగారి రాజేందర్ తదితరులు

చేర్యాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి త్వరితగతిన కోలుకోవాలని వేడుకుంటూ పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు భూమిగారి రాజేందర్, పుట్ట యశ్వంత్, కల్లాటి విశ్వతేజ తదితరులు శుక్రవారం చేర్యాల నుంచి యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వరకు పాదయాత్రగా తరలివెళ్లారు. ఈసందర్భంగా స్థానిక అంగడి బజారువద్ద స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు.

పాఠశాలకు సౌండ్ సిస్టం అందజేసిన పూర్వ విద్యార్థులు



జగదేవ్‌పూర్ ఉన్నత పాఠశాలకు సౌండ్‌సిస్టం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

జగదేవ్‌పూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తాము చదువుకున్న పాఠశాలకు ఏదైనా సహాయం అందించాలని ఉద్దేశంతో పూర్వ విద్యార్థులు సౌండ్ మైక్ సిస్టంను అందజేశారు. మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1992-93లో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులందరూ కలిసి సుమారు రూ. 20 వేల విలువైన చార్జబుల్ సౌండ్ సిస్టంను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సైదులు, ఉపాధ్యాయులు జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు శ్రీధర్‌శర్మ, నాగిరెడ్డి, మాధవరెడ్డి, శేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్ తదితరులున్నారు.

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసిన వంటేరు



గజ్వేల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి శుక్రవారం మాజీ సీఎం కేసీఆర్‌ను కలిశారు. తన పుట్టిన రోజు సందర్భంగా కేసీఆర్‌ను ఆయన ఫాంహౌస్‌లో కలుసుకోగా, కేసీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు మాజీ మంత్రి హరీశ్‌రావును ప్రతాప్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా, వంటేరు ప్రతాప్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా పలు కార్యక్రమాలను నిర్వహించారు.